సర్కార్‌పై ఉద్యోగుల జంగ్ సైరన్

▸ మొదటిపేజీ తరువాయి...

జేఏసీలో భాగస్వామ్యమయ్యాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి మొత్తం 36 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. వీటి పరిష్కారానికి చొరవ చూపాలని, లేదంటే 15 రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామని అల్టిమేటం జారీచేసింది. సర్కారు స్పందించి వెంటనే తమను చర్చలకు పిలవాలని లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. టీఈజేఏసీ ఆవిర్భావంతో పాటు 15 మందితో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న పీఆర్టీయూ టీజీ సైతం ఇదే జేఏసీలో భాగస్వామ్యమైంది. ఈ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ సైతం ఎంప్లాయీస్ జేఏసీ సమావేశానికి హాజరయ్యారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రెసా ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ, తాహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, టీపీటీయూ అధ్యక్షుడు రాధాకృష్ణ, వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోల్కొండ సతీష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మాడల్ స్కూల్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న టీచర్లు

నల్ల బ్యాడ్జీలతో మాడల్ స్కూల్ టీచర్ల నిరసన

010 పద్దు ద్వారా వేతనాలు, బదిలీలు చేయాలని డిమాండ్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12: తమకు ఏండ్ల తరబడి బదిలీలు చేపట్టడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మాడల్ స్కూల్ టీచర్లు సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. తమకు బదిలీలు లేక ఒకే పాఠశాలలో 11 ఏండ్లుగా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బాలరాజు, అంజయ్య, శోభారాణి, రేణుక, జ్యోతి, సరిత, ప్రభాకర్, శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

మమ్మల్ని పిలిచిన.. చర్చించిన దాఖలాల్లేవు

ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసమే జేఏసీగా ఏర్పడ్డాం. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 15 రోజుల్లోనే పెండిగ్ డీఏలు విడుదల చేస్తామని చెప్పారు. మెరుగైన పీఆర్సీ ఇస్తామన్నారు. సీపీఎస్‌ను రద్దుచేస్తామన్నారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని హామీనిచ్చి మ్యానిఫెస్టోలో పెట్టారు. 9 నెలలు కావొస్తున్నా ఒక్కటంటే ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. గతంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉంటేనే సమ్మెకు దిగిన సందర్భాలున్నాయి. ఇప్పుడు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మరో డీఏను సర్కారు త్వరలోనే బాకీ పడబోతున్నది. ఇది ఉద్యోగులు తెచ్చిన ప్రభుత్వమని రేవంత్‌రెడ్డి పలుమార్లు అన్నారు. కానీ, ఇంతవరకు ఉద్యోగులను పిలిచి సమస్యలపై చర్చించిన దాఖలాలేవు. అమెరికా పర్యటన నుంచి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలి. లేదంటే రాబోయే 10 -15 రోజుల్లో జేఏసీని పటిష్టంచేసి, జిల్లాలు తిరిగి మా కార్యాచరణ ప్రకటిస్తాం. మరో ఉద్యమానికి పిలుపునిస్తాం. ముందుగా జిల్లాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కార సభలు నిర్వహిస్తాం. ఆ తర్వాత నల్లబ్యాడ్జీలతో నిరసనలు, మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలుంటాయి. అయినా ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు ప్రభుత్వం అన్యాయం తలపెడితే ఏ ఉద్యమానికైనా మేం సిద్ధమే.

– మారం జగదీశ్వర్, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్

ఒకటో తేదీన కొన్నిశాఖల్లో జీతం వస్తలేదు

ఉద్యోగులకు సంబంధించి వందల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆగస్టు 15 తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని, మమ్మల్ని చర్చలకు పిలుస్తామని మౌఖికంగా ప్రభుత్వవర్గాలు చెప్పాయి. సమయం దగ్గరపడుతున్నదని కాబట్టి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు అనుసరిస్తున్న ఈ కుబేర్, టోకెన్ విధానాన్ని రద్దుచేయాలి. కొత్త ప్రభుత్వంలో మొదటి తేదీనే జీతాలిస్తామన్నారు. కానీ కొన్ని శాఖల్లో మొదటి తేదీన జీతాలు రావడంలేదు. ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశ, ఈజీఎస్ ఉద్యోగులంతా ఏకమయ్యాం. మేమంతా జేఏసీగా ఏర్పడ్డామంటేనే మా కార్యాచరణ రూపొందిస్తున్నామని అర్థం. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, సర్వీస్ రూల్స్ ఏర్పాటుతో సగం సమస్యలు, సీఎస్‌తో సమావేశం పెడితే మరో సగం సమస్యలు పరిష్కారమవుతాయి. జేఏసీని చర్చలకు పిలిస్తే అనేక సమస్యలు పరిష్కారమయ్యే అవకాశముంది. మా న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

– ఏలూరి శ్రీనివాస్‌రావు, ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్

ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించాలి

సీపీఎస్ రద్దు సహా టీచర్ల అనేక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అత్యంత కీలకమైన ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలి. మోడల్ స్కూల్, ఎయిడెడ్, గురుకుల టీచర్లకు ఒకటో తేదీన జీతాలు అందడంలేదు. వీరికి 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి. సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

తక్షణమే కొత్త పీఆర్సీ వేయాలి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ నాంది పలికింది. ఉమ్మడి ఏపీలో పనిచేసినట్టుగానే జేఏసీ మరింత ప్రభావశీలంగా పనిచేయాల్సిన అవసరమున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక వాగ్దానాలిచ్చారు. అనేక సమస్యలు పరిష్కరిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారు. వాటిని ప్రభుత్వం పరిష్కరించే దిశగా చొరవచూపాలి. పీఆర్సీ గడువు ముగిసి 13 నెలలైంది. తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని కొత్త పీఆర్సీ వేయాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.

– చావ రవి, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

విద్యారంగాన్ని గాడినపెట్టాలి

టీచర్ల బదిలీలు, పదోన్నలిచ్చారు సంతోషం. కానీ ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యారంగాన్ని ప్రభుత్వం గాడినపెట్టాలి. విద్యాశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉండటం, ఇతర పనుల్లో ముఖ్యమంత్రి బిజీగా ఉండటంతో విద్యాశాఖకు సంబంధించిన అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే విద్యాశాఖను సీఎం వదిలించుకుని ప్రత్యేక మంత్రికి కేటాయించాలి.

–వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

భవిష్యత్తు కార్యాచరణ అవసరం

ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ అవసరం. అనేక మండలాలకు ఎంఈవోలు లేరు. ఆరేడు మండలాలకో ఎంఈవో చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. జూనియర్ లెక్చరర్, బీఈడీ, డైట్ కాలేజీ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలి. అన్ని జిల్లాలకు డీఈవోలు లేరు. ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. పాఠశాలల పర్యవేక్షణ దెబ్బతింటున్నది. అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలను నియమించాలి.

– సదానందంగౌడ్, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఎన్నికల సమయంలో రెవెన్యూశాఖలో బదిలీలు చేపట్టారు. ఎన్నికలు ముగియగానే వారిని వెనక్కి తీసుకురావాల్సి ఉండె. తహసీల్దార్లతో పాటు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను ఒక జిల్లాలో పనిచేస్తున్న వారిని మరో జిల్లాకు బదిలీచేశారు. ఇతర శాఖల్లో విలీనం చేసిన వీఆర్వోలను పాత సర్వీసుతో సహా తిరిగి రెవెన్యూశాఖలోనే కొనసాగించాలి. వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలి.

– వంగ రవీందర్‌రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు

సర్కారు ముందు ఉద్యోగుల డిమాండ్లు ఇవే!

- సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి.
- ఉద్యోగుల చందాతో కూడిన ఈహెచ్ఎస్ అమలుచేయాలి.
- బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదలచేయాలి.
- ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలుచేయాలి.
- గచ్చిబౌలి టీఎన్జీవోకు రెండో ఫేజ్‌లో కేటాయించిన 101.02 ఎకరాల స్థలంపై సొసైటీకి యాజమాన్య హక్కులు కల్పించాలి.
- భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీకి శేరిలింగంపల్లి మండలం సర్వే నంబర్ -36, 37 గోపన్‌పల్లిలో ఇండ్ల స్థలాలకు సంబంధించిన మెమోను రద్దుచేయాలి.
- ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితి వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- సచివాలయంలోకి హెచ్‌వోడీల నుంచి 12.5శాతం కోటాను అమలు చేసి ఉద్యోగులను పంపించాలి.
- జీవో-317లోని లోపాలను సవరించాలి. పాత ఉద్యోగులకు పాత సీనియార్టీని కొనసాగించాలి. అంతర్‌జోనల్, స్పౌజ్‌బదిలీలు చేపట్టాలి.
- మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలి.
- కొత్త జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త కేడర్ స్ట్రెంథ్ మంజూరుచేయాలి.
- రంగారెడ్డి కలెక్టరేట్ ఉద్యోగులకు పూర్వపు 24శాతం హెచ్ఆర్ఏను మంజూరుచేయాలి.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలి.
- పాత పీఆర్సీలోని పెండింగ్ బిల్లులను క్లెయిమ్ చేసుకునేందుకు గడువు 2026, మార్చి 31 వరకు పొడగించాలి.
- రాష్ట్రంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- రీ అపాయింట్‌మెంట్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ సర్వీసును నిలిపివేయాలి.
- ఉద్యోగుల మీద కక్షసాధింపులు, తనిఖీలను నిలిపివేయాలి.
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను 1, 2, 3, 4 గ్రేడ్లుగా విభజించి క్యాడర్ స్ట్రెంథ్ ఏర్పాటు చేయాలి. పంచాయతీ కార్యదర్శుల సర్వీసును అపాయింట్‌మెంట్ తేదీ నుంచి క్రమబద్ధీకరించాలి.
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన వారిని తిరిగి వారి స్థానాలకు పంపాలి.
- వైద్యవిధాన పరిషత్తు, గ్రంథాలయాలు, మార్కెటింగ్, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలి.
- ప్రత్యేక నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి.
- ఏసీబీ కేసు, ఇతర క్రమశిక్షణ కేసుల్లో సస్పెండైన ఉద్యోగులను ఒకసారి రివ్యూ కమిటీని ఏర్పాటు చేసి, ఆ తర్వాత తప్పక విధుల్లోకి తీసుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఉన్నత చదువుల కోసం ఆన్‌డ్యూటీ సౌకర్యంతో కూడిన సెలవులిచ్చే జీవో 342ను పునరుద్ధరించాలి.
- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీ చేసిన తాసిల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తాసిల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను పూర్వ జిల్లాలకు బదిలీచేయాలి.
- వీఆర్ఏలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- ఇతరశాఖల్లోకి పంపిన వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూశాఖలోకి ఆప్షన్ల ద్వారా తీసుకొచ్చి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి.
- ఉస్మానియా యూనివర్సిటీలో ఓపీఎస్/ సీపీఎస్ అమలుకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను కెప్ట్ ఇన్ అబయన్స్‌లో పెట్టిన ఉత్తర్వులను రద్దుచేయాలి.
- పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి.
- గురుకుల, మోడల్ స్కూల్ టీచర్లు సహా అందరు ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలివ్వాలి.
- జిల్లాలకు డీఈవో, నియోజకవర్గాలకు డిప్యూటీ ఈవో, ఎంఈవో పోస్టులను మంజూరుచేయాలి.
- సమగ్రశిక్ష వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల ఉద్యోగుల సహా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- 2004, జనవరి 5 కంటే ముందు నోటిఫికేషనిచ్చి తర్వాత నియమతులైన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి.

ఇంటి భోజనానికి గుర్తింపు

నర్సంపేటలోని హోటల్‌కు భారత సర్కారు అవార్డు

నర్సంపేట, ఆగస్టు 12: వరంగల్ జిల్లా నర్సంపేట నడిబొడ్డున ఉప్పలయ్య అనే వ్యక్తి 30 ఏండ్ల నుంచి నడిపించిన హోటల్‌కు ఇప్పుడు భారత ప్రభుత్వ గుర్తింపు లభించింది. అక్కడ దొరికేది రుచికరమైన, నాణ్యమైన ఇంటి భోజనం. తక్కువ ధరలకే లాభాపేక్ష లేకుండా అందిస్తున్నారు. ఇల్లే హోటల్‌గా నడిపిస్తున్నారు. ఈ హోటల్‌కు భారత ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజినల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ ద్వారా అవార్డు వచ్చింది. సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌లో భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లారు. సోమవారం వారు మళ్లీ వచ్చి హోటల్‌లో ఇదే నాణ్యత కొనసాగించాలంటూ అవార్డును అందించారు. ఉప్పలయ్య మరణానంతరం అదే హోటల్‌ను ఆయన కుమారుడు శ్రీనివాస్ నడిపిస్తున్నారు. హోటల్‌లో కుటుంబ సభ్యులు మొత్తం వర్కర్లుగా ఉండి సొంతంగా వంటలు చేస్తారు. ఇక్కడ రోజూ 150 నుంచి 200 మంది భోజనం చేస్తున్నారు. సాదా భోజనానికి రూ.90 తీసుకుంటున్నారు. వెజ్, నాన్ వెజ్ కూడా ఉంటుంది.

వరంగల్ జిల్లా నర్సంపేటలోని హోటల్

అసైన్డ్ భూముల్లో వెంచర్

▸ మొదటిపేజీ తరువాయి...

అనాజ్‌పూర్ గ్రామంలోని సర్వేనంబర్ 281లో గుట్టలను తొలగించిన దృశ్యం

పైగా అసైన్డ్, సీలింగ్ భూములను కొందరు చెరపట్టారు. బహిరంగంగానే వంద ఫీట్ల రహదారులు, ఇతరత్రా నిర్మాణాలు చేపడుతున్నారు. నెల రోజులుగా భారీ వెంచర్ పనులు దర్జాగా జరుగుతున్నా... రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం 'నోటీసులు ఇచ్చాం కదా!' అంటున్నారు. ఇదంతా రచ్చ జరుగుతుండటంతో సదరు వ్యక్తులకు రెవెన్యూ అధికారులే అధికారిక కబ్జాకు కొత్త మార్గాన్ని చూపుతున్నారు. రైతుల నుంచి పీవోటీ కింద భూములు సేకరించి... ఆ వ్యక్తులు ప్రభుత్వపరంగా కొనుగోలు చేసేందుకూ రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఉన్నారనే ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. మరి..పేదలకో న్యాయం? పెద్దోళ్లకు మరో న్యాయమా? అని సామాన్యుడు ప్రశ్నిస్తున్న ఈ కబ్జా బాగోతంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

గుట్టలను కరిగించి...

రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్-ఇబ్రహీంపట్నం మండలాల సరిహద్దున ఓ భారీ వెంచర్ రూపుదిద్దుకుంటుంది. వంద ఫీట్ల రహదారుల నిర్మాణమే కాకుండా పెద్ద పెద్ద గుట్టలను పిండి చేసి, చదును చేసేందుకు భారీ ఎత్తున యంత్రాలు కూడా మోహరించారు. సుమారు నెల రోజులకు పైగా అక్కడ పెద్ద ఎత్తున పనులు కొనసాగుతున్నాయి. తీరా.. ఆ భూములు ఏ పరిధిలోకి వస్తాయని ఆరా తీస్తే విస్మయకర అంశాలు వెలుగు చూశాయి. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబరు 189... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 281 పరిధిలోనే ఈ వెంచర్ తయారవుతుంది. ఇందులో నాగన్‌పల్లి పరిధిలోని భూములన్నీ ప్రభుత్వంతో పాటు పలువురు రైతులకు లావునీ పట్టాల కింద పంపిణీ చేసినవిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఇక.. అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని భూముల్లో కొంత మేర పట్టా భూమి కాగా.. మిగిలినదంతా సీలింగ్ పట్టా. అయినప్పటికీ అన్నింటినీ కలిపి దాదాపు 300 ఎకరాల్లో భారీ వెంచర్‌కు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం నెల రోజులకు పైగా అక్కడ పెద్ద పెద్ద యంత్రాలతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

40-50 ఎకరాల్లో రోడ్లు, ఇతర నిర్మాణాలు...

ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబరు 189లో 179 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన పలువురు నిరుపేద రైతులకు వ్యవసాయం చేసుకునేందుకు భూమిని పంపిణీ చేసి లావణి పట్టాలు ఇచ్చారు. సదరు రియల్టర్లు చేస్తున్న వెంచర్‌కు వెళ్లాలంటే ఈ భూముల మీదుగానే వెళ్లాలి. దీంతో వెంచర్‌కు సంబంధించిన వ్యక్తులు రైతులతో రహస్యంగా ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. 99 సంవత్సరాల ప్రాతిపదికన లీజు ఒప్పందం చేసుకొని వారికి కొన్ని లక్షలు ముట్టజెప్పారు. ఇలా 40-50 ఎకరాల మేర లావణి పట్టా భూముల్ని ఒప్పందం చేసుకొని అందులో వంద ఫీట్ల రహదారుల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు సెక్యూరిటీ, ఇతరత్రా వాటి కోసం గదుల నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. తమకు ఎంత మేర భూమి కావాలనేది నిర్ధారించుకొని చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు ఇనుప రాడ్లనూ సరిహద్దుపై ఏర్పాటు చేశారు. దీనిపై గతంలోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. లావునీ పట్టా భూములను ఆయా రైతులు మాత్రమే సాగు చేసుకోవాల్సి ఉంటుంది. లేనట్లయితే ప్రభుత్వ స్వాధీనంలో ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులు రహస్యంగా వాటిని లీజు రాయించుకోవడంతో పాటు బహిరంగంగా నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. ఇప్పటికే కిలోమీటరుకు పైగా రహదారి నిర్మాణం కూడా పూర్తయింది. దీంతో రెవిన్యూ అధికారులు కొన్నిరోజుల కిందటే అక్కడికి వచ్చి విచారణ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఆ పనులు జరుగుతున్నాయని, ప్రభుత్వ భూమి కబ్జా అవుతుందని కిందిస్థాయి అధికారులు నివేదిక కూడా ఇచ్చారు. వాస్తవానికి వెంటనే అధికారులు రంగంలోకి దిగి పనులు నిలిపివేయాల్సి ఉండగా... కేవలం రైతులు, సదరు ప్రైవేటు సంస్థకు చెందిన రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అక్కడ యథేచ్ఛగా పనులు జరుగుతున్నా అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. మరోవైపు ఇబ్రహీంపట్నం మండలం అనాజీపూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 281లో దాదాపు 300 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. ఇందులో కొంతమేర పట్టా ఉండగా... దాదాపు 80-100 ఎకరాల వరకు సీలింగ్ పట్టా భూములు ఉన్నాయి. దీంతో ఆ భూములను కూడా కలుపుకొని భారీ వెంచర్‌కు రంగం సిద్ధం చేశారు.

పెద్దల హస్తంతోనే పీవోటీ డ్రామా

నిరుపేద రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను కొన్ని సందర్భాల్లో తిరిగి ప్రభుత్వం వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రజా ప్రయోజనాలతోపాటు ఆ భూముల్ని సదరు రైతులు దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించినపుడు అధికారులు పీవోటీ కింద సేకరిస్తారు. ఇక్కడ రైతులతో సదరు ప్రైవేటు సంస్థకు చెందిన వ్యక్తులు రహస్యంగా 99 సంవత్సరాల లీజు కొంద ఆ భూములను కొనుగోలు చేసినట్టు తెలిసింది. పైగా బహిరంగంగానే అసైన్డ్ భూముల్లో రహదారులు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో మీడియా, ఇతరులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. నోటీసులు ఇచ్చిన అధికారులు వాటి స్వాధీనానికి ప్రయత్నించినప్పటికీ.. ఈ వ్యవహారం వెనక ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఉండటంతో అధికారులు వెనక్కి తగ్గినట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికంగానైతే పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న వారితోపాటు వారి సోదరుల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని అధికారికంగానే చేసేందుకు పీవోటీ డ్రామా తెరపైకి తీసుకువస్తున్నట్టు తెలిసింది. రెవెన్యూ శాఖ అధికారులు పీవోటీ కింద రైతుల నుంచి ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే... ప్రజా ప్రయోజనాల కోసమని సదరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం నుంచి నామమాత్రపు రేటు ఆ భూముల్ని కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇందుకోసం అధికారుల సలహా, సహకారంతోనే భారీ స్కెచ్ వేసినట్టు తెలుస్తున్నది.

నోటీసులు ఇచ్చాం...స్వాధీనం చేసుకుంటాం

ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 189లో గల ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసినట్టు దృష్టికి వచ్చింది. ఈ భూమి అసైన్డ్ పొందిన రైతులకు, రియల్ ఎస్టేట్ సంస్థ యజమానులకు నోటీసులు ఇచ్చాం. గడువులోపు సరైన సమాధానం ఇవ్వకపోతే పీవోటీ కింద ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం. అనాజ్‌పూర్ గ్రామంలో కూడ సీలింగ్ పట్టాల క్రయ విక్రయాలపై కూడా విచారణ జరుపుతున్నాం. క్రయ విక్రయాలు జరిగినట్టు తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం.

- అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో

రాష్ట్రంలో హ్యుందాయ్ కార్ల మెగా టెస్ట్ సెంటర్

- **వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు**
- **కొరియన్ కంపెనీలతో సీఎం రేవంత్ బృందం భేటీ**
- **త్వరలో తెలంగాణ రానున్న ఎల్ఎస్ కంపెనీ బృందం**

దక్షిణ కొరియాకు చెందిన ఎల్ఎస్ గ్రూప్ చైర్మన్ కుజాయున్ బృందంతో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): దక్షిణకొరియాకు చెందిన ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ తెలంగాణలో తమ వాహనాల మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించేందుకు ఆసక్తి వ్యక్తంచేసింది. పలు కొరియన్ కంపెనీలు వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తంచేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం తమ అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం దక్షిణ కొరియాకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు హ్యుందాయ్ మోటార్ కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని కంపెనీ యోచిస్తున్నట్టు సీఎంవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిపై కంపెనీ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. దీంతోపాటు వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యాంగాన్ చైర్మన్ కిహక్ సుంగ్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సోయాంగ్ సహ 25 భారీ జౌళి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు తెలంగాణలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి ఉన్న సానుకూలతలను సీఎం వివరించగా.. పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఆసక్తి కనబరిచాయి. దక్షిణ కొరియాలో అతి పెద్ద పారిశ్రామిక సంస్థ ఎల్ఎస్ కంపెనీ ప్రతినిధులు త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారు. ఎల్ఎస్ గ్రూప్ చైర్మన్ కుజాయున్ బృందంతో సీఎం బృందం చర్చలు జరిపింది. సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం సియోల్‌లో పర్యటించనున్నది. బుధవారం ఉదయానికి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

పెద్దవూర/ఆత్మకూరు/భూత్పూర్, ఆగస్టు 12: అప్పుల బాధలు భరించలేక రాష్ట్రంలో సోమవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అందులో ఒకరు నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి తండాకు, మరొకరు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన వారు ఉన్నారు. చింతపల్లి తండాకు చెందిన జటావత్ కృష్ణ (40) 5 ఎకరాలతోపాటు మరో మూడెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలను కాపాడుకునేందుకు ఇటీవల 8 బోర్లు వేయగా చుక్కనీరు పడలేదు. గతంలో పంట పెట్టుబడి కోసం రూ.10 లక్షల అప్పు చేశాడు. అవి తీరకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సాగర్‌లోని కమలానెహ్రూ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీరబాబు తెలిపారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన కడుదల సంపత్ (57)కు 4.30 ఎకరాల భూమి ఉంది. ఇందులో పత్తి వేయగా.. పంట పెట్టుబడి, ఇతర ఖర్చుల కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. నడుం నొప్పితో బాధపడుతూ.. వైద్యం కోసమూ అప్పులు చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. ఇంటి చుట్టుపక్కల వారు, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సంతోష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మరో రైతు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం మద్దిగట్లకు చెందిన రైతు మేకల లక్ష్మయ్య (62) ఆదివారం పొలం వద్ద నీరు పారించేందుకు బోరు మోటర్ వేసేందుకు స్టార్టర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్ వైర్ కొద్దిగా తేలి ఉండగా గమనించకుండా ఆన్ చేసే క్రమంలో చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో రైతు కొడుకులు శివరాజ్, మల్లేశ్ పొలం వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే విగత జీవిగా కనిపించాడు. జిల్లా దవాఖానకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థికి టీచర్ పనిష్మెంట్

జవాబు చెప్పలేదని కింద కూర్చోబెట్టిన టీచర్

ఎదులాపురం, ఆగస్టు 12: ఆదిలాబాద్ పట్టణం వెంకట్‌రావు కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి సోమవారం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. టీచర్ పనిష్మెంట్ ఇచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఎప్పటిలాగే తరగతులు జరుగుతున్నాయి. క్లాసులో టీచర్ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగారు. జవాబు చెప్పని విద్యార్థిని పనిష్మెంట్ ఇచ్చి కింద కూర్చోబెట్టారు. దీనిని అవమానంగా భావించిన ఆ విద్యార్థి నేరుగా పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసుల ముందు తన గోడు వెల్లబోసుకున్నాడు. ఇంతలో సమాచారం తెలుసుకున్న విద్యార్థి తండ్రి హుటాహుటిన పోలీస్‌స్టేషన్ వచ్చి కుమారుడిని సముదాయించి ఫిర్యాదు చేయొద్దని తీసుకెళ్లాడు. దీంతో ఈ విషయం పాఠశాలలో, పోలీస్ స్టేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

గుండెపోటుతో టెన్త్ విద్యార్థిని మృతి

జ్యోతినగర్, ఆగస్టు 12: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని సెయింట్‌క్లేర్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం సాహితి (15) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. బాలికకు రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి దవాఖానకు తరలించారు. నొప్పి ఎక్కువ కావడంతో వైద్యులు కరీంనగర్ దవాఖానకు రెఫర్ చేశారు. దీంతో అక్కడి నుంచి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. తండ్రి రాజలింగు రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగి.